
Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
17-2-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 95

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## ఆ అసత్యాలపై బదులేది బాబూ?

- తిరుపతి లడ్డూపై బాబుకు సుప్రీం చీవాట్లను 'ఎక్స్' వేదికగా గుర్తు చేసిన సుబ్రమణియన్ స్వామి
- బీజేపీని బాబు ఎప్పుడు వదిలేస్తారని ప్రశ్నం

న్యూఢిల్లీ: తిరుపతి లడ్డూ విషయంలో అసత్యాలు చెప్పినందుకు అత్యున్నత న్యాయస్థానం మందలించడంపై ఏపీ సీఎం చంద్రబాబు నుంచి ఇంతవరకూ సమాధానమే లేదని బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ సుబ్రమణియన్ స్వామి

- మిగతా 2వ పేజీలో

# ఐఏఎస్‌లూ మారండి

- ఒక్క త ప్పు చేయమంటే.. 3 తప్పులు చేద్దామనే అధికారులను చూస్తున్నా
- సమాజానికి ఇది మంచిది కాదు.. ఐఏఎస్ అధికారులు మంచి, చెడు చెప్పాలి
- వారి పనితీరుపై ఏమాత్రం సంతృప్తిగా లేను.. ఏసీ గదులకే పరిమితం అవుతున్నారు
- ప్రజల వద్దకు వెళ్తేనే సమస్యలు తెలుస్తాయి.. మాజీ ఐఏఎస్ పుస్తకావిష్కరణలో సీఎం




హైదరాబాద్,: ప్రభుత్వ అధికారుల వ్యవహార శైలిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అ?ధికారులు మంచీ చెడులపై సలహా చెప్పేవిధంగా ఉండాలని, రాజకీయ నేతలు ఇస్తున్న ఆదేశాల్లో తప్పొప్పులను ఎత్తి చూపాలని అన్నారు. కానీ, నేటి అధికారుల్లో ఈ వైఖరి కరువైందని, ఒక త ప్పు చేయమంటే.. మూడు తప్పులు చేద్దామనే అధికారులను చూస్తున్నానని వ్యాఖ్యానించారు. సమాజానికి ఇది మంచిది కాదన్నారు. ఆదివారం మాజీ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణనాయుడు రచించిన 'లైఫ్ ఆఫ్ ఎ కర్మయోగి' పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత అధికారుల వ్యవహారశైలి పట్ల తాను ఏమాత్రం సంతోషంగా లేనన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఏసీ గదుల నుంచి బయటకు రావడం మానేశారని, ఏసీ అనేది జబ్బేమోననిపిస్తోందని అన్నారు. అధికారులు ప్రజల వద్దకు వెళ్లినప్పుడే

- మిగతా 2వ పేజీలో



## అత్యధిక అప్పులు చేసిన.. మీరా మమ్మల్ని అనేది?

- రూ.125 లక్షల కోట్లు ఏం చేశారో.. మోదీ చెప్పాలి
- నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ బహిరంగలేఖ

హైదరాబాద్, "బీఆర్ఎస్ పదేళ్ల పాలన తర్వాత కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమే..! దేశచరిత్రలో అత్యధిక అప్పులు చేసిన మీరా(బీజేపీ).. మమ్మల్ని అనేది?" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. అప్పులను, మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. ఈ మేరకు నిర్మలా సీతారామన్‌కు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రాజ్యసభలో నిర్మల చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ హయాంలో.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసిన అప్పును

- మిగతా 2వ పేజీలో

# తొక్కిసలాటకు కారణం.. రెండు రైళ్లు.. ఒకే పేరు





- అనౌన్స్‌మెంట్ వినగానే కుంభమేళా ప్రయాణికుల్లో హైరానా
- తమ రైలే అనుకుని ప్లాట్‌ఫాం మారేందుకు పరుగులు
- ఇరుకు మెట్లు, ఓవర్‌బ్రిడ్జిపై ఒకరి మీద ఒకరు పడి దుర్ఘటన
- 18కి పెరిగిన మృతులు, 30 మందికి గాయాలు
- మృతుల్లో 16 మంది మహిళలు, చిన్నారులే

న్యూఢిల్లీ: రెండు రైళ్లకు ఒకేలాంటి పేరు. ఇరుకైన ఓవర్ బ్రిడ్జి. సమాచార లోపం. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటకు ఇవే ప్రధాన కారణాలని తేలింది. మహా కుంభమేళాకు బయల్దేరిన ప్రయాణికుల్లో చాలామంది 14వ నంబర్ ప్లాట్‌ఫాంపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ కోసం భారీ సంఖ్యలో వేచి

మిగతా 2లో

## పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- చేనేతరంగ అభివృద్ధికి టెక్స్‌టైల్ పాలసీ
- దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలతో మంత్రి సవిత

అమరావతి, ఆంధ్రప్రదేశ్‌లో చేనేతరంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు టెక్స్‌టైల్ పాలసీ తీసుకొచ్చారని, పెట్టుబడులకు రాష్ట్రం అనువైన ప్రాంతమని బీసీ సంక్షేమ, చేనేత జౌళ్ల శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ భారత్ టెక్స్-2025 కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. దేశ విదేశాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు తక్షణ

- మిగతా 2వ పేజీలో



## ఏటా రూ.9 లక్షల కోట్ల వస్త్ర ఎగుమతులు


- గడువు కంటే ముందే లక్ష్యం సాధిస్తాం
- 'భారత్ టెక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం

న్యూఢిల్లీ: ఇండియా నుంచి ప్రతిఏటా రూ.9 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. 2030ని డెడ్‌లైన్‌గా విధించింది. అయితే, గడువు కంటే ముందే అనుకున్న లక్ష్యం సాధిస్తామన్న విశ్వాసం తనకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆదివారం 'భారత్ టెక్స్%-%2025' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వస్త్రాల ఎగుమతిలో ప్రస్తుతం మన దేశంలో ప్రపంచంలో ఆరో స్థానంలో ఉందని తెలిపారు. మనం ప్రతిఏటా రూ.3 లక్షల కోట్ల విలువైన వస్త్రాలు ఎగుమతి చేస్తున్నామని వెల్లడించారు. దీన్ని మూడు రెట్లు పెంచాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలతో వస్త్ర టెక్స్‌టైల్ రంగం గణనీయమైన ప్రగతి సాధించిందని హర్షం వ్యక్తంచేశారు. ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు రెండు రెట్లు పెరిగాయని చెప్పారు. మనం ఇలాగే కష్టపడి పనిచేస్తే


- మిగతా 2వ పేజీలో

# 4 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నాం

- 7 లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్నాం!
- రాష్ట్రమంతా స్కిల్ సెంటర్లు పెడుతున్నాం
- త్వరలో మెగా డీఎస్సీ ప్రకటించనున్నాం
- కూటమి ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలివీ
- వీటిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనది
- కలిసికట్టుగా పనిచేసి కూటమిని గెలిపించండి
- ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు సీఎం దిశానిర్దేశం



అమరావతి,: రాష్ట్రానికి సుమారు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి, 4 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్రమంతా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పెడుతున్నామని, త్వరలో మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నామని తెలిపారు. ఇవన్నీ 8 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలని, వీటిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించేలా నాయకులంతా సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల



# తొక్కిసలాటకు కారణం.. రెండు రైళ్లు.. ఒకే పేరు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. 'ప్రయాగ్‌రాజ్ స్పెషల్' రైలు 12వ ప్లాట్‌ఫాంపైకి వచ్చినట్లు ప్రకటన రావడంతో తమ రైలే ఫ్లాట్‌ఫాం మారిందని భావించారు. భారీ జనసందోహం నడుమ ఏమాత్రం ఆలస్యమైనా రైలు అందదేమోనని భయపడ్డారు. 12వ ప్లాట్‌ఫాంకు చేరేందుకు ఉన్నపళంగా పరుగులు తీశారు. ఓవర్ బ్రిడ్జిపైకి దారితీసే మెట్ల మార్గంపైకి వేలాదిగా ఎగబడ్డారు. దానికి తోడు ఓవర్ బ్రిడ్జి కూడా సన్నగా ఉంది. వాటిపై ప్రయాణికులు పరస్పరం నెట్టేసుకుంటూ దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో ఒకరిపై ఒకరు పడిపోయారు. చాలామంది ఊపిరాడక కన్నుమూశారు. పోలీసులు హెచ్చరిస్తున్నా అరుపులు కేకలతో ఏమీ విన్పించలేదు. ఈ దారుణంలో మృతుల సంఖ్య ఆదివారం 18కి పెరిగింది. వారిలో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులున్నారు. 30 మంది గాయపడ్డారు. తొక్కిసలాట తర్వాత మెట్ల మార్గం, ఓవర్ బ్రిడ్జిపై ఎక్కడ చూసినా చెప్పులు, చిరిగిన బ్యాగులే కనిపించాయి. రెండు రైళ్లకు ప్రయాగ్‌రాజ్ పేరుండడం అయోమయానికి దారి తీసిందని పోలీసులు ఆదివారం ధ్రువీకరించారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించారు. రైల్వే శాఖ కూడా విచారణకు ఆదేశించింది. వాస్తవానికి న్యూఢిల్లీ స్టేషన్ నుంచి శనివారం నాలుగు రైళ్లు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరాల్సి ఉంది. వాటిలో మూడు ఆలస్యమయ్యాయి. స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ కూడా ఆలస్యమయ్యాయి. దాంతో ఆ ఐదు రైళ్లలో వెళ్లాల్సిన వారంతా ప్లాట్‌ఫాంలపైనే ఉండిపోవడంతో స్టేషన్ కిక్కిరిసిపోయింది. ఓదుర్ఘటన జరిగినా న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ఆదివారం కూడా ప్రయాణికుల రద్దీ విపరీతంగా కొనసాగింది. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లడానికి వేలాది మంది తరలివచ్చారు. రైళ్లు ఎక్కడానికి పడరాని పాట్లు పడ్డారు. అధికారులు సైతం నియంత్రించలేని పరిస్థితి నెలకొంది.సమాచార లోపానికి తోడు ప్రయాణికులు గందరగోళానికి గురికావడం వల్లే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. తొక్కిసలాటపై దర్యాప్తు కోసం ప్రత్యేక విచారణ ఏర్పాట్లు చేసినట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ప్రిన్సిపల్ స్టేషన్‌లోని వీడియో ఫుటేజీ అందజేయాలని అధికారులను ఆదేశించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు,తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడినవారికి రూ.లక్ష పరిహారం ప్రకటించింది.

**వైష్ణవ్ రాజీనామా చేయాలి**

తొక్కిసలాటకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ ఆదివారం డిమాండ్ చేశారు. లేదంటే కేంద్రమే ఆయన్ను తొలగించాలన్నారు. రైల్వేస్టేషన్‌కు వేలాది మంది జనం తరలివచ్చినా భద్రతా ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. "దేశంలో ఇప్పుడు రెండు హిందూస్తాన్‌లు ఉన్నాయి. ఒక హిందూస్తాన్‌లో పాలకులు తమ మిత్రులకు స్వయంగా కుంభమేళాలో పుణ్యస్నానాలు చేయిస్తున్నారు. మరో హిందూస్తాన్‌లో సామాన్యులు ఇలా రైల్వేస్టేషన్లలో బలైపోతున్నారు. కుంభమేళాలో వీఐపీ సంస్కృతి నడుస్తోంది" అని ఆక్షేపించారు.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం**

ఢిల్లీ రైల్వేస్టేషన్ ఘటనపై పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ప్రధాని మోదీ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు.

# ఏటా రూ.9 లక్షల కోట్ల వస్త్ర ఎగుమతులు

(మొదటి పేజీ తరువాయి)



గడువు కంటే ముందే ఏటా రూ.9 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను ఎగుమతి చేయగలమని స్పష్టంచేశారు. టెక్స్‌టైల్ రంగంలో ఒక యూనిట్ ఏర్పాటు చేయడానికి రూ.75 కోట్లు అవసరమని, దీంతో 2,000 మందికి ఉపాధి లభిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ రంగంలో అడుగుపెడుతున్న ఔత్సాహికులకు రుణ సదుపాయం కల్పించాలని బ్యాంక్‌లకు సూచించారు. వస్త్ర పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన కార్మికులకు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 5ఎఫ్ విజన్‌ను ప్రధానమంత్రి ప్రతిపాదించారు. ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్. ఈ విజన్‌తో రైతులకు, నేత కార్మికులకు, డిజైనర్లకు, వ్యాపారులకు నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఉద్ఘాటించారు. వస్త్ర పరిశ్రమకు కావాల్సిన నూతన పరికరాల తయారీ కోసం ఐఐటీల వంటి విద్యా సంస్థలతో కలిసి పనిచేయాలని వ్యాపారులకు సూచించారు. భారత్ టెక్స్ ఇప్పుడు అంతర్జాతీయ కార్యక్రమంగా మారిందన్నారు. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. హై%-%గ్రేడ్ కార్బన్, ఫైబర్ తయారీ దిశగా మన దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# 4 లక్షల మందికి ఉపాధి కల్పించనున్నాం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో ఆదివారం సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ప్రతి ఎన్నికా మనకు పరీక్షవంటిదే. మూడు పార్టీల అభ్యర్థులు కలిసికట్టుగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ ఓటర్లను చైతన్యపర్చాలి. ఐదేళ్ల విధ్వంసపాలనలో గాడితప్పిన వ్యవస్థలను గాడిలో పెట్టి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నాం' అన్నారు. ఎన్నికలకు 10 రోజుల సమయం మాత్రమే ఉందని, మూడు పార్టీల నేతలు కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల నియామావళిని ఉల్లంఘించకుండా విజయం కోసం పనిచేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కన్నా ఈ ఎన్నికల్లో వచ్చే మెజారిటీ మెరుగ్గా ఉండాలన్నారు.

# ఐఏఎస్‌లూ మారండి

(మొదటి పేజీ తరువాయి)



ప్రజా సమస్యలు అర్థమవుతాయని, ఆఫీసుల్లో కూర్చుంటే ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రారంభమైన తన రాజకీయ పయనంలో చాలావరకు ప్రతిపక్షంలోనే ఉన్నానని, అప్పట్లో జిల్లా కలెక్టర్లు మారుమూల ప్రాంతాల్లో పర్యటించి ఆయా గ్రామాల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేవారని తెలిపారు. ఇప్పటికీ తాను గ్రామాలకు వెళ్లినప్పుడు.. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం తమ గ్రామానికి వచ్చిన కలెక్టర్ గురించి అక్కడి ప్రజలు గుర్తు చేస్తుంటారని చెప్పారు. దీనిని బట్టి నాటి అధికారులు ప్రజలతో ఎలా ఉన్నారో, ఎలాంటి ముద్ర వేసుకున్నారో నేటి అధికారులు తెలుసుకోవాలని సూచించారు. గతంలో అధికారులు.. రాజకీయ నాయకులు ఏదైనా విషయాన్ని ప్రస్తావించినప్పుడు అందులోని లోటుపాట్లను, దాని వల్ల వచ్చే నష్టాన్ని చెప్పేవారని సీఎం రేవంత్ అన్నారు. చట్టవిరుద్ధంగా వెళితే భవిష్యత్తులో తలెత్తే సమస్యను వివరించేవారని, నాయకులను అప్రమత్తం చేస్తూ.. జరగబోయే పరిణామాలను గుర్తుచేసే వారని తెలిపారు. కానీ, ఈ రోజుల్లో అలా చెప్పడం తగ్గిపోయిందన్నారు. "ఇందుకు కారణమేంటో నాకు తెలియదు. కానీ, పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌ను సంతోష పెట్టాలనో లేక తనకు తాను సంతోషపడాలనో.. రాజకీయ నాయకులు తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్నీ అమలు చేస్తున్నారని అనుకుంటున్నా" అని రేవంత్ అన్నారు. ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ, వారి చదువు, అనుభవం వేర్వేరు కావచ్చునని, ఏమీ చదువుకోని వారికి విద్యాశాఖను కూడా ఇవ్వవచ్చని, పొలిటికల్ ఎగ్జిక్యూటివ్ జాబ్‌కు, వారి చదువుకు ఏమాత్రం సంబంధం ఉండదని పేర్కొన్నారు. అందుకే తమకు అవగాహన కల్పించడానికి సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ ప్రకారం అధికారులు అవసరమవుతారని తెలిపారు. వారు ఏ ఫైలు వచ్చినా.. అందులోని తప్పొప్పులను తమకు వివరించాలని అన్నారు.

**అలాంటి వారికి తప్పక గుర్తింపు ఉంటుంది..**

నిబద్ధత కలిగిన అధికారులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని సీఎం పేర్కొన్నారు. పేదలకు సాయం చేయాలన్న ఆలోచన అధికారులకు ఉండాలని, అలాంటివారే ప్రజల మనసులో నిలిచిపోతారని చెప్పారు. ఆ దిశగా రాష్ట్రంలోని అధికారులు దృష్టి సారించాలని తాను కోరుకుంటున్నానన్నారు. కలెక్టర్లు, ఎస్పీలను తరచూ మాజీ అధికారులతో సదస్సుల ద్వారా కలుసుకునే అవకాశం కల్పించాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. గోపాలకృష్ణనాయుడు తన ఆరు దశాబ్దాల అనుభవాన్ని గ్రంథ రూపంలో నిక్షిప్తం చేయడం పెద్ద టాస్క్ అని ప్రశంసించారు. దేన్నయినా కొనవచ్చునని, అనుభవాన్ని మాత్రం కొనలేమని పేర్కొన్నారు. సివిల్ సర్వెంటరికీ ఈ పుస్తకం దిక్సూచిగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శంకరన్, మన్మోహన్‌సింగ్, శేషన్‌లను గుర్తుకుతెచ్చుకోవాలని సీఎం సూచించారు. నిబద్ధతతో పనిచేసిన గొప్ప అ?ధికారి శంకరన్ కాగా, పారదర్శక ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన వ్యక్తి శేషన్ అని అన్నారు. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. అలాంటి సివిల్ సర్వెంట్ల అనుభవాల నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు.

# అత్యధిక అప్పులు చేసిన.. మీరా మమ్మల్ని అనేది?

(మొదటి పేజీ తరువాయి)



తప్పుగా చూపించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ రాష్ట్రానికి దాదాపు రూ.70 వేల కోట్ల అప్పు ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. పదేళ్ల తర్వాత కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే తెలంగాణను కాంగ్రెసకు అప్పజెప్పాం. చేసిన అప్పులతో ప్రజల దశాబ్దాల కష్టాలను తీర్చాం.రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించాం" అని ఆ లేఖలో వెల్లడించారు. గడిచిన పదేళ్లలో మోదీ సర్కారు రూ.125 లక్షల కోట్ల మేర అప్పు చేసిందని, దాంతో ఏం చేశారో చెప్పాలని నిర్మలను నిలదీశారు. కేంద్రం చేసిన అప్పులన్నీ కార్పోరేట్ల లక్షల కోట్ల రుణాల మాఫీ కోసమేనని ఆరోపించారు. "స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి 14 మంది ప్రధానులు.. 65 ఏళ్లలో 56 లక్షలకోట్లు అప్పుచ్చేస్త.. మోదీ గడిచిన పదేళ్లలోనే రూ.125లక్షల కోట్ల చేశారు. బీజేపీకి అప్పులపై మాట్లాడే నైతిక హక్కు లేదు" అని వ్యాఖ్యానించారు. అటు కేంద్రబడ్జెట్‌లో, ఇటు రైల్వే కేటాయింపుల్లో బీజేపీ సవతి ప్రేమ కనబరుస్తోందని, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీని ప్రజలు క్షమించరన్నారు ఇక, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడటం దారుణమని, రాష్ట్రానికి మీరిచ్చే బహుమానం ఈ అవమానాలేనా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్రబడ్జెట్‌లో పసుపుబోర్డుకు ఒక్కపైసా కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు.

గురుకుల విద్యాసంస్థలను రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్వీర్యం చేస్తోందని, కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏడాదిలో 50 మందికి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణించినా.. కాంగ్రెస్ సర్కార్‌లో కనీసం చలనంలేదన్నారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కనీస పరామర్శ లేకపోగా.. అంత్యక్రియలకు పరామర్శకు వెళ్లే ప్రతిపక్షంపై ఈ ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

# ఆ అసత్యాలపై బదులేది బాబూ?

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. ఈమేరకు తిరుపతి లడ్డూ కల్తీ కేసు విచారణ సందర్భంగా గతేడాది సెప్టెంబర్ 30న సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ స్వామి ఆదివారం తన ఎక్స్ ఖాతాలో మూడు పోస్టులు చేశారు. తిరుపతి లడ్డూ వివాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కోర్టు తీవ్రంగా మందలించిందని, కల్తీ నెయ్యిని వాడారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని న్యాయస్థానం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. 'ఆ అసత్యాలపై ఇప్పటికీ చంద్రబాబు నుంచి సమాధానం లేదు. ఆయన నిర్లక్ష్యంపై మోదీ ఎందుకు చర్యలు తీసుకోరు? బాబు ఎప్పుడు బీజేపీని వదిలేస్తారు?' అని ఎక్స్‌లో స్వామి ప్రశ్నలు సంధించారు. సుప్రీంలో పిల్ దాఖలు చేసిన స్వామి..: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని నియమించాలని కోరుతూ సుబ్రమణియన్ స్వామి గతేడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయడం తెలిసిందే. ల్యాబ్ నివేదికపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, టీటీడీ ఈవోలను ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ కేసులో సుబ్రమణియన్ స్వామి స్వయంగా (పార్టీ ఇన్ పర్సన్) వాదనలు వినిపించారు. ఏ నివేదిక ఆధారంగా రాద్ధాంతం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారో.. దాన్ని రూపొందించేందుకు ఉపయోగించిన నెయ్యి ఎక్కడిది? టీటీడీ తిరస్కరించిన నెయ్యిలో అది ఉందా? నివేదిక వెనుక రాజకీయ పార్టీల దురుద్దేశాలున్నాయా? అనే విషయాలను తేల్చాలని స్వామి తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

**దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలన్న కోర్టు..**

లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యిని వాడారంటూ దాఖలైన పిటిషన్‌పై సెప్టెంబర్ 30న విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది.

తిరుపతి లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కూడిన నెయ్యిని వాడారంటూ ప్రభుత్వం చేసిన వాదనను నిరూపించేందుకు ఖచ్చితమైన ఆధారాలు లేవంటూ.. ఆ ఆరోపణలను తీవ్రంగా తప్పుబట్టింది. ఏపీ ప్రభుత్వం సమర్పించిన ల్యాబ్ నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు.. పరీక్ష కోసం పంపిన నెయ్యిని తిరస్కరించారని, లడ్డూల తయారీకి దాన్ని ఉపయోగించలేదని పేర్కొంది.



# పెట్టుబడులకు ఏపీ అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు, రాయితీలు ఇవ్వడంతో పాటు భూకేటాయింపులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రపంచంలోనే మేలైన పట్టు, చేనేత వస్త్రాలు తమ రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నాయని, వాటి మార్కెటింగ్‌కు రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో చేనేత ఎగ్జిబిషన్లు, ఎక్స్‌పోలు నిర్వహిస్తున్న తెలిపారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారికి 365 రోజుల పని కల్పించే లక్ష్యంతో టెక్స్‌టైల్ పార్కులు, వీవర్ శాలలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి చెప్పారు. నూలు కొనుగోలుపై 15 శాతం మేర రారుతీ అందిస్తున్నామన్నారు. చేనేత వస్త్రాల వినియోగంపై పెరుగుతున్న మక్కువను దృష్టిలో పెట్టుకుని అమెజాన్, మింత్రా, ఫ్లిప్‌కార్ట్, జియోమార్ట్ వంటి ఏడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో 20 ఆప్కో షోరూమ్‌ల ద్వారా డోర్ డెలివరీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఏపీ చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పావనమూర్తి పాల్గొన్నారు.



# ‘కోడ్’ ముగిశాక ఆర్టీసీలో సమ్మె

- ప్రభుత్వానికి మరో జేఏసీ అల్టిమేటం
- ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన ఒక జేఏసీ
- మార్చి 7 వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- కార్మికులు సమ్మెకు సిద్ధంగా లేరని ఇంటెలిజెన్స్ నివేదిక

హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులు సంస్థ యాజమాన్యంపై పోరుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే ఒక కార్మిక జేఏసీ సమ్మె నోటీసు ఇవ్వగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమ్మె నోటీసు ఇవ్వాలని మరో జేఏసీ తాజాగా నిర్ణయించింది. మొదటి జేఏసీ నిరవధిక సమ్మెకు మొగ్గు చూపుతుండగా, రెండో జేఏసీ మాత్రం ఐదారు రోజులుపాటు సమ్మె చేయాలని భావిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసేలోపు తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో సమ్మె అనివార్యమని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చింది. అయితే, కార్మికుల్లో సమ్మెపై ఒకింత భయం కనిపిస్తుండగా, సంఘాల నాయకులు మాత్రం సమ్మెకు సిద్ధమని ప్రకటిస్తున్నారు.

**ప్రైవేటు సంస్థల పెత్తనంతో..**

ఇటీవల ఆర్టీసీ పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశమొదుతోంది. అవన్నీ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు తీసుకుంటోంది. ఆ బస్సుల నిర్వహణ కోసం కొన్ని డిపోలను సదరు సంస్థకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేయటంతో ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇది ఆర్టీసీలో ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేయటమేనని మండిపడుతున్నారు. దీంతో అధికారులు వెనుక్కు తగ్గి డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతోపాటు సాధారణ సొంత బస్సులు కూడా కొనసాగుతాయని స్పష్టత ఇచ్చారు. అయినా ఉద్యోగుల్లో అనుమానాలు తొలగిపోలేదు. ఈ అంశంతోపాటు చాలా కాలంగా పెండింగులో ఉన్న ఇతర సమస్యలను తెరపైకి తెచ్చి కార్మిక సంఘాలు సమ్మెకు సై అంటున్నాయి.

**విలీనం, పీఆర్సీనే ప్రధాన ఎజెండాగా..**

గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించింది. అంతలోనే ప్రభుత్వం మారుటంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పెండింగులో పెట్టింది. 2017 వేతన సవరణ బకాయిలు కూడా చెల్లించలేదు. 2021 వేతన సవరణపై ప్రభుత్వం స్పందించటంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దుచేసిన గుర్తింపు యూనియన్ల పునరుద్ధరణ జరగలేదు. సీసీఎస్, పీఎఫ్‌లకు భారీగా బకాయిలు పేరుకుపోయాయి. వీటి సాధనే లక్ష్యంగా కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యాయి.

**ఎవరికి వారే..**

ఎంప్లాయీస్ యూనియన్, టీఎంయూ చీలికవర్గం, బీడబ్ల్యూయూ, బీకేయూ, ఎన్ఎంయూ చీలిక వర్గం, కేపీ సంఘాలతో కూడిన తొలి జేఏసీ గత నెల 27న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చింది. ఫిబ్రవరి 3న ఆ యూనియన్ల ప్రతినిధులను కార్మిక శాఖ చర్చలకు పిలిచి, తర్వాత ఎన్నికల కోడ్ కారణం చూపి సమావేశం రద్దు చేసింది. దీంతో, ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ఆర్టీసీ సమ్మెకు మినహాయింపు ఇవ్వాలని ఆయా సంఘాల నేతలు ఎన్నికల కమిషనర్‌కు విన్నవించారు. టీఎంయూ, ఎన్ఎంయూ వర్గాలు, బీఎంఎస్, ఎస్టీ ఎంయూలతో కూడిన మరో జేఏసీ తదుపరి సమావేశం ఏర్పాటు చేసుకుని, ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రభు త్వానికి గడువు ఇస్తున్నట్టు ప్రకటించింది. కోడ్ ముగిసిన తర్వాత సమ్మె నోటీసు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. మార్చి 7 వరకు కోడ్ అమలులో ఉంటుంది. ఐదారు రోజులపాటు సమ్మె చేసి, కొద్ది రోజుల గడువు ఇచ్చి మళ్లీ సమ్మె చేయాలనే యోచనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు ఆర్టీసీ కార్మికుల్లో 10 వేల మంది మాత్రమే సమ్మెకు సిద్ధంగా ఉన్నట్లు ఇంటెలిజెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

## మేడ్చల్ హత్య కేసులో ట్విస్ట్



మేడ్చల్: మేడ్చల్‌లో పట్టపగలే దారుణ హత్య జరిగింది. బస్సు డిపో వద్ద నడిరోడ్డుపై ఓ వ్యక్తిని దారుణంగా కత్తులతో పొడిచి చంపారు. ఉమేష్ అనే వ్యక్తిని ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమ్ముడే అన్నను చంపినట్లు పోలీసులు గుర్తించారు. తమ్ముడే మరో వ్యక్తితో కలిసి అన్నను చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు.



## విజయవంతంగా బీఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్ శిక్షణ

- రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి
- మూడో బ్యాచ్‌కి ఆదివారం అర్హత పరీక్ష
- మూడేళ్లలో 30 వేల మందికి ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బీటెక్ పట్టభద్రుల కోసం ప్రారంభించిన బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ %-% స్కిల్లింగ్) కోర్సుకు మంచి స్పందన లభిస్తోంది. మొదటి, రెండో విడత బ్యాచ్‌ల శిక్షణ ఇప్పటికే పూర్తికాగా, మూడో విడత కోర్సుల శిక్షణ కోసం ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. వీరిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది జూలై వరకు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇస్తారు. ఆ తరువాత బీఎఫ్ఎస్ఐకు సంబంధించి హైదరాబాద్‌లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఏటా 10 వేల మందికి శిక్షణ ఇస్తారు. వీరిలో 5 వేల మంది ఇంజనీరింగ్, మరో 5 వేల మంది డిగ్రీ పట్టభద్రులుంటారు. రానున్న మూడేళ్లలో 30 వేల మంది తెలంగాణ యువతకు ఈ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో ‘బీఎఫ్ఎస్ఐ %-% స్కిల్లింగ్’ కోర్సు ప్రారంభమైంది. ఖర్చును ఎక్విప్, బీఎఫ్ఎస్ఐ కన్సార్షియం భరిస్తుంది. విద్యార్థుల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న పట్టభద్రులు స్కిల్స్ యూనివర్సిటీ వెబ్‌సైట్ %ఎఅంబ.అఅ% ను సందర్శించాలని కోరారు.

## ‘రికార్డు’ స్థాయి నాట్యం



3 వేల మంది నాట్య ప్రదర్శన.. నాలుగు రికార్డుల నమోదు

### సమతాస్ఫూర్తి కేంద్రంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

(హైదరాబాద్): మూడు వేల మంది చిన్నారులు.. నర్తించిన వివిధ నృత్య రూపకాలు నాలుగు రికార్డులను నమోదు చేశాయి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రం ఇందుకు వేదిక గా మారింది. సమతాకుంభ్--2025 తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘంటసాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు వేల మందితో మహాబృందం చే సిన నాట్యం ఆకట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల చిన్నారులు వివిధ నృత్య రూపకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇండియన్ వరల్డ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నృత్య గోల్డెన్ స్టార్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను నమోదు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి చిన్నారులకు మంగళశాసనాలు అందజేశారు.



## నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

**71 కిలోల భారీ కేక్ సిద్ధం.. తెలంగాణ భవన్‌లో ప్రత్యేక డాక్యుమెంటరీ**

హైదరాబాద్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు 71వ జన్మదిన వేడుకలు సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో భాగంగా 71 కిలోల భారీ కేక్‌ను కట్ చేస్తారు. కేసీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని వివరించేలా రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారు. డప్పు కళాకారులు, గిరిజన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెలంగాణ భవన్‌లో జరిగే కేసీఆర్ జన్మదిన వేడుకల ఏర్పాట్లను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు హాజరవుతారు. రాష్ట్రవ్యాప్తంగా పండ్ల పంపిణీ, అన్నదానం, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు, దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తారని తలసాని వెల్లడించారు.

## ఓ లింగా.. ఓ లింగా..

**వైభవంగా పెద్దగట్టు జాతర ప్రారంభం**



సూర్యాపేట: ‘ఓ లింగా.. ఓ లింగా..’నామస్మరణతో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర మార్మోగింది. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర ఆదివారం అర్ధరాత్రి మంద గంపల ప్రదక్షిణలతో వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎంలలో పెద్దగట్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాదవులు సంప్రదాయ దుస్తుల్లో డోలు వాయిద్యాలు, భేరీల చప్పుళ్లు, కటారు విన్యాసాలు చేస్తూ ఓ లింగా.. నామస్మరణతో గట్టుపైకి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి పూజలు చేశారు. జాతర మొదటిరోజులో భాగంగా సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి దేవరపెట్టెను యాదవ కులస్తులు కాలినడకన ఊరేగింపుగా పెద్దగట్టుకు చేర్చారు. అంతకు ముందు కేసారం గ్రామంలో దేవరపెట్టెలోని దేవతామూర్తులకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి వేర్వేరుగా పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి కూడా ప్రత్యేక పూజలు చేశారు. కాగా, సోమవారం.. చౌడమ్మతల్లికి బోనాలు సమర్పించనున్నారు. జాతర రెండోరోజు అత్యంత ముఖ్యమైన ఘట్టం కావడంతో భక్తులు లక్షల్లో తరలివచ్చే అవకాశం ఉందని చెపుతున్నారు. ఇదిలా ఉండగా, పెద్దగట్టు జాతర నేపథ్యంలో విజయవాడ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి విజయవాడ, ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను పోలీసులు దారిమళ్లిస్తున్నారు.

# ఉదయం 11కే మటన్ మాయం!

హైదరాబాద్: ఆదివారం ఉదయం... 11.30 గంటల సమయం.. హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతానికి చెందిన అరవింద్ మటన్ తీసుకురావడం కోసం బయల్దేరాడు.. తాను రెగ్యులర్‌గా వెళ్లే షాపు దగ్గరికి వెళ్లే సరికి మూసేసి ఉంది. దగ్గర్లోని మరో దుకాణానికి వెళితే బారెడంత క్యూ కనిపించింది. లేటవుతుందేమోనని మరో చోటికి వెళ్తే... మటన్ అయిపోయిందని చెప్పారు. దీనితో వెనక్కి వచ్చి క్యూలో నిలబడి అయినా తీసుకెళదామనుకుంటే... తన వంతు కూడా రాకముందే మటన్ అయిపోయిందంటూ దుకాణం కట్టేయడం మొదలుపెట్టారు.. అరవింద్ ఒక్కడికే కాదు, ఉప్పల్ ఒక్క ప్రాంతంలోనే కాదు.. ఆదివారం హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపించింది. చెంగిచర్ల, జియాగూడ వంటి మటన్ మండీల్లోనూ మధ్యాహ్నానికే స్టాక్ ఖాళీ అయిపోయింది. మరోవైపు బర్డ్ ఫ్లూ, ఇతర వైరస్‌లతో కోళ్లు మృతిచెందుతున్నాయన్న వార్తలతో చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి.

**ధర విపరీతంగా పెరిగినా..**

ఇటీవలి కాలంలో మటన్ ధరలు కిలో రూ.800 నుంచి రూ.900 వరకు చేరాయి. అలాంటిది డిమాండ్ పెరిగిపోవడంతో.. ఆదివారం చాలా చోట్ల కిలో రూ.1,000 నుంచి రూ.1,100 వరకు ధరతో విక్రయించారు. అయినా సరే మటన్ షాపుల వద్ద జనం కిటకిటలాడారు. కిలో తీసుకునే చోట అరకిలో, అరకిలో తీసుకునే చోట పావుకిలోనో, 400 గ్రాములో కొనుక్కుని వెళ్లారు.

**ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గడంతో..**

సాధారణంగా మహారాష్ట్ర, రాజస్తాన్‌తోపాటు పలు ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు మేకలు, గొర్రెలు దిగుమతి అవుతాయి. అయితే బర్డ్ ఫ్లూ, ఇతర వైరస్‌ల ప్రభావం నేపథ్యంలో ఈ దిగుమతులు తగ్గిపోయాయి. వైరస్‌లు ఇతర ప్రాంతాలకు విస్తరించవద్దన్న ఉద్దేశంతో మేకలు, గొర్రెల రవాణాను నియంత్రిస్తున్నారని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీనితో రాష్ట్రంలోని జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి అరకొరగా గొర్రెలు, మేకలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో.. ధరలు పెరిగాయని మీరాలం మండిలోని మక్బూల్, జియాగూడ మండిలో మేకల వ్యాపారి రమేశ్ తెలిపారు.

**చికెన్‌కు తగ్గిన డిమాండ్**



బర్డ్ ఫ్లూ, ఇతర వైరస్‌లతో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయన్న వార్తలతో చికెన్‌కు డిమాండ్ ఒక్కసారిగా తగ్గిపోయింది. సాధారణంగా ప్రతి ఆదివారం కిటకిటలాడే చికెన్ సెంటర్లు... ఈ ఆదివారం వెలవెలబోయాయి. వైరస్ భయం కారణంగా ఎందుకైనా మంచిదంటూ.. చికెన్‌కు బదులు మటన్ తీసుకెళ్తున్నామని వినియోగదారులు చెబుతున్నారు. నిజానికి చికెన్‌ను 70 నుంచి 100 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించి తింటే ఎటువంటి హానీ ఉండదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# హైదరాబాద్‌లో టూరిస్ట్ ఇళ్లు..

# సకల వసతులు



**వేసవి సెలవుల్లో సేద తీరడానికి పలు కుటుంబాలు పర్యాటక ప్రదేశాలకు వెళ్తుంటాయి. కానీ, అక్కడి వసతి ఎలా? హోటళ్లలో ఉండాలంటే.. కాస్త ఖర్చు ఎక్కువే. నచ్చిన వంట వండుకోలేం. సరైన ఆతిథ్యాన్ని స్వీకరించలేం. వాళ్లు పెట్టినవాటిలో నుంచి ఎంపిక చేసుకొని తినాలి. దీనికి పరిష్కారం చూపించేవే పర్యాటక విడిదులు. స్టార్ హోటళ్లను తలదన్నేలా ఆధునిక వసతులు అందించడమే ఈ టూరిస్ట్ ఇళ్ల ప్రత్యేకత.**

**ఇళ్లు.. హోంస్టేలుగా!**

భాగ్యనగరం అంటేనే చక్కని ఆతిథ్యానికి చిరునామా. అందుకే విదేశీ పర్యాటకులు ఇక్కడి ఆత్మీయత, ఆతిథ్యానికి ముగ్ధులవుతుంటారు. ఈ ఆనందాన్ని ద్విగుణీకృతం చేసేందుకు పర్యాటక శాఖ హోం స్టే పథకం ప్రవేశపెట్టింది. ఇదే తరహాలో పలు ప్రైవేట్ సంస్థలూ సేవలందిస్తున్నాయి. నగరంలోని గృహ యజమానులు తమ ఇళ్లను అద్దెకు ఇచ్చే బదులుగా ఇలా హోంస్టే సంస్థలతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఆకట్టుకునేలా గృహాలను తీర్చిదిద్ది, అన్ని సౌకర్యాలు కల్పించి, పర్యాటకులకు తాత్కాలికంగా కిరాయికి ఇస్తున్నారు.

**అన్ని రకాల వసతులు..**

ఎయిర్ బీఎన్‌బీ, వీఆర్బో, బుకింగ్.కామ్, మేక్ మై ట్రిప్, ట్రావెల్ స్టేషన్, హోమ్ టుగో వంటి సంస్థలు హోం స్టే సేవలను అందిస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రధాన నగరాలతోపాటు పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లు, తీర్థయాత్రలు అన్నిచోట్లా టూరిస్ట్ ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. కిచెన్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి అన్ని రకాల వసతులు ఈ హోం స్టేలలో ఉంటాయి. సౌకర్యాలను బట్టి అద్దె ఒక రాత్రికి రూ.5 వేల నుంచి ఉంటాయి.ఆయా పర్యాటక ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న హోం స్టేల వివరాలను సంస్థలు తమ వెబ్‌సైట్లలో పొందుపరుస్తున్నాయి. వారికి అనువైన వసతిని వెతుక్కోవచ్చు. ఇందులోనే ధరలను కూడా నిర్ణయిస్తారు. వండి వడ్డించే భోజనం వివరాలు కూడా ఉంటాయి. విమానాశ్రయం నుంచి నేరుగా బస చేసే ఇంటికి వచ్చి ఆతిథ్యాన్ని అందుకోవచ్చు.



## ట్రంప్ నిర్ణయాల ఎఫెక్ట్.. అమెరికాలో అమ్మకానికి భారీగా ఇళ్లు!

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత.. డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ఇతర దేశాలను మాత్రమే కాకుండా, ఆ దేశ ప్రజలను కూడా భయపెడుతున్నాయి. దీంతో వాషింగ్టన్ డీసీలో రియల్ ఎస్టేట్ మార్కెట్ పతనం జరగనున్నట్లు భావించి.. వేల ఇళ్లను అమ్మకానికి ఉంచారు. దీనికి సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు కూడా నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.వాషింగ్టన్ డీసీలో గత 14 రోజుల్లోనే 4,271 కంటే ఎక్కువ ఇళ్ళు అమ్మకానికి ఉంచినట్లు.. ఒక ఎక్స్ యూజర్ పేర్కొంటూ.. "ఎలుకలు పారిపోతున్నాయి" అని అన్నారు. నగరవాసులు తమ వస్తువులను సర్దుకుని.. సామూహికంగా నగరం విడిచి వెళ్తున్నారని అన్నారు. వలసలకు కారణం.. ఇలాన్ మస్క్ నేతృత్వంలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' అని చెబుతున్నారు. నగరంలో, ఆ చుట్టుపక్కల అమ్మకానికి ఉన్న 14,825 ఇళ్లను చూపించే ఫోటోలను కూడా షేర్ చేశారు. నగరంలో 500 కంటే ఎక్కువ ఇల్లు రూ. 8 కోట్ల కంటే ఎక్కువ ధరకు అమ్మకానికి ఉన్నాయని.. అమెరికన్లను సురక్షితంగా ఉంచే విధానాలపై పనిచేసే థింక్ ట్యాంక్ అయిన సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీలో పనిచేస్తున్న సీనియర్ విశ్లేషకుడు పేర్కొన్నారు. ఆన్‌లైన్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ప్లేస్ అయిన 'జిల్లో'లో అమ్మకానికి ఉన్న ఇళ్ల జాబితాలను మరో ఎక్స్ యూజర్ షేర్ చేసాడు. ఏడు రోజులలో 201, 14 రోజులలో 378, 30 రోజులలో 706, 90 రోజులలో 1,198 కొత్త ఇళ్లు అమ్మకానికి ఉన్నట్లు పేర్కొన్నాడు. దీనికి సంబంధించిన కొన్ని ఫోటోలను కూడా షేర్ చేసాడు.

## స్టూడియో అపార్ట్‌మెంట్లకు తగ్గిన డిమాండ్



తెల్లారింది లేచామా.. ఆఫీసుకు వెళ్లామా.. రాత్రికి ఎప్పుడో ఇంటికి చేరుకున్నామా.. మరుసటి రోజు మళ్లీ సేమ్ టు సేమ్.. ఇదే నగరవాసి జీవితం.. సంపాదన బిజీలో పడిన సగటు జీవికి కాసేపు సేదతీరేందుకే గూడు. ఇదంతా కరోనాకు ముందు.. కరోనా వచ్చి సగటు మనిషి ప్రపంచాన్నే మార్చేసింది. కేవలం తినడం, పడుకోవడమే కాదు.. ఆఫీసు, స్కూల్, వ్యాయామం, వినోదం అన్నీ ఇంటి నుంచే కావడంతో ఒకప్పుడు హాట్ కేకుల్లా అమ్ముడుపోయిన స్టూడియో అపార్ట్‌మెంట్లకు క్రమంగా డిమాండ్ పడిపోయింది. వీటి స్థానంగా విశాలమైన గృహాలు, ఫ్లాట్స్‌కు గిరాకీ పెరిగిపోయింది. బెడ్ కం లివింగ్ రూమ్, కిచెన్, అటాచ్డ్ బాత్‌రూమ్ ఉండే వాటిని స్టూడియో అపార్ట్‌మెంట్ అంటారు. కరోనా మొదలైన ఏడాది(2020) నుంచి దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఈ తరహా అపార్ట్‌మెంట్ల సరఫరా క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. గతేడాది తొలి అర్ధ వార్షికం(జనవరి%-%జూన్)లో 1,063 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో కేవలం 9 శాతం(91 ప్రాజెక్ట్‌లు) మాత్రమే స్టూడియో అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయని అనరాక్ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 1,207 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో 145 ప్రాజెక్ట్‌లు స్టూడియో అపార్ట్‌మెంట్లున్నాయి.

## టెక్నాలజీ అద్భుతం.. ఫుడ్ తినని డాగ్

పెంపుడు జంతువులంటే ఇష్టం ఉన్న వారు కూడా, వాటికి వేళకు ఆహారం, ఆరోగ్యంపై దృష్టి సారించలేక వాటిని పెంచుకోవడానికి వెనుకాడతారు. అయితే, ఈ రోబోడాగ్‌తో ఈ సమస్యలేవీ ఉండవు.తాజాగా, అమెరికన్ రోబోటిక్స్ కంపెనీ 'టోంబోట్' రోబోటిక్ కుక్కపిల్లను 'జెన్నీ' పేరుతో రూపొందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో తయారు చేసిన ఈ రోబో కుక్కపిల్ల బ్యాటరీలతో పనిచేస్తుంది. ఇందులోని టచ్ సెన్సర్స్ సాయంతో ఇది అచ్చం పెంపుడు కుక్కపిల్లలాగానే స్పందిస్తుంది. దీన్ని గమనించిన వారు ఇదొక రోబో అన్న విషయమే గుర్తించలేరు. ఇళ్లల్లో శిక్షణ పొందిన పెంపుడు కుక్కపిల్లల మాదిరిగానే ఈ జెన్నీ కూడా షేక్ హ్యాండ్ ఇవ్వడం, ఎగరడం, కాళ్లపై కూర్చోవడం వంటి పనులన్నీ చేస్తుంది. దీనిని స్మార్ట్ యాప్ సాయంతో నియంత్రించుకోవచ్చు.



## బజాజ్ కన్స్యూమర్ కేర్ చేతికి విశాల్ పర్సనల్ కేర్

హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న విశాల్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ముంబై ఆధారిత బజాజ్ కన్స్యూమర్ కేర్ లిమిటెడ్ సొంతం చేసుకుంటున్నది. రెండు విడుతల్లో జరుగనున్న ఈ డీల్ విలువ రూ.120 కోట్లుగా అంచనా వేస్తున్నారు. విశాల్ పర్సనల్ కేర్‌లో తొలుత 49 శాతం వాటాను, ఆ తర్వాత మిగతా 51 శాతం వాటాను బజాజ్ కన్స్యూమర్ కేర్ కొనుగోలు చేయబోతున్నది. ఇక విశాల్ పర్సనల్ కేర్‌లో 2012లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ పీపుల్ క్యాపిటల్ పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు ఈ వాటాలనూ బజాజ్ కన్స్యమర్ కేర్ కొనాల్సి ఉన్నది. కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో బంజారా బ్రాండ్ పేరిట వివిధ శిరోజ, చర్మ సంరక్షణ ఉత్పత్తులను విశాల్ పర్సనల్ కేర్ విక్రయిస్తున్న విషయం తెలిసిందే. క్రమంలో తాజా లావాదేవీ పూర్తయితే ఈ బ్రాండ్ బజాజ్ కన్స్యూమర్ కేర్ గూటికి వెళ్లిపోనున్నది. 'ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో బజాజ్ కన్స్యూమర్ కేర్ వ్యాపార కార్యకలాపాల బలోపేతానికి విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలు వ్యూహాత్మకంగా కలిసిరాగలదు' అని ఈ సందర్భంగా బజాజ్ కన్స్యూమర్ కేర్ ఎండీ జైదీప్ నంది అన్నారు. శుక్రవారం జరిగిన తమ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలుకు ఆమోదం లభించినట్టు ఆయన చెప్పారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24) విశాల్ పర్సనల్ కేర్ రెవిన్యూ రూ.51 కోట్లుగా ఉన్నది. దీన్ని 1991లో స్థాపించారు. హెర్బల్ పౌడర్లు, అలోవెరా జెల్స్, షాంపూలు, హెయిర్ కేర్ పౌడర్లు అమ్ముతున్నది. ఏపీ, తెలంగాణసహా ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో దీనికి 70వేలకుపైగా ఔట్‌లెట్లున్నాయి. ఇదిలావుంటే కుషగ్ర బజాజ్ నేతృత్వంలోని 2.5 బిలియన్ డాలర్ల విలువైన బజాజ్ గ్రూప్‌లోగల ఎఫ్ఎంసీజీ కంపెనీయే బజాజ్ కన్స్యూమర్ కేర్. గత ఆర్థిక సంవత్సరం దీని ఆదాయం రూ.967.71 కోట్లు, లాభం రూ.158.77 కోట్లుగా ఉన్నది.

# ఇవి రీచార్జ్ చేసుకుంటే ఫ్రీగా జియో హాట్‌స్టార్

రిలయన్స్ జియో తన ప్రీపెయిడ్, జియోఫైబర్ ప్లాన్‌లను జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో అప్‌డేట్ చేసింది. వీటిలో జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో ఒక కొత్త ప్లాన్‌ను తీసుకురాగా, డిస్నీ హాట్‌స్టార్‌కు బదులుగా జియోహాట్‌స్టార్‌ను చేర్చడానికి మరికొన్ని ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ జియోఫైబర్ ప్లాన్‌లను అప్‌డేట్ చేసింది.

**జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో జియో ప్రీపెయిడ్ ప్లాన్**

రిలయన్స్ జియో తన రూ.949 ప్రీపెయిడ్ ప్లాన్‌ను జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో అప్‌డేట్ చేసింది. ఈ ప్లాన్ అపరిమిత కాలింగ్, అపరిమిత 5%+% డేటా, రోజుకు 2%+దీ 4+% డేటాతో వస్తుంది. అదనంగా, ఇది జియో టీవీ, జియోక్లౌడ్‌తో పాటు 3 నెలల పాటు జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌ను కలిగి ఉంటుంది. అయితే ఇందులో చేర్చిన జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ 'మొబైల్' ప్లాన్ అని గమనించడం ముఖ్యం.

**జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో జియోఫైబర్ ప్లాన్‌లు**

**జియోఫైబర్ రూ.999 ప్లాన్:** ఈ ప్లాన్ అపరిమిత డేటా, వాయిస్ కాలింగ్‌తో 150 Mbps వేగాన్ని అందిస్తుంది. అంతేకాకుండా వినియోగదారులు ఈ ప్లాన్‌తో అమెజాన్ ప్రైమ్ లైట్, జియో హాట్‌స్టార్‌తో పాటు 8 ఇతర ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌లను పొందుతారు. అలాగే ఈ ఆఫర్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లకు వర్తిస్తుంది.

**జియోఫైబర్ రూ.1,499 ప్లాన్:** ఈ ప్లాన్ అపరిమిత డేటా, వాయిస్ కాలింగ్‌తో




300Mbps వేగాన్ని అందిస్తుంది. అంతేకాకుండా ఈ ప్లాన్‌తో అమెజాన్ ప్రైమ్ లైట్, జియో హాట్‌స్టార్‌తో పాటు 8 ఇతర ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌లను అందుకోవచ్చు. ఈ ఆఫర్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లకు వర్తిస్తుంది.

**జియోఫైబర్ రూ.2,499 ప్లాన్:** అపరిమిత డేటా , వాయిస్ కాలింగ్‌తో 500 Mbpsవేగాన్ని అందిస్తుంది. దీంతోపాటు వినియోగదారులు ఈ ప్లాన్‌తో అమెజాన్ ప్రైమ్ లైట్, జియో హాట్‌స్టార్‌తో పాటు 8 ఇతర ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌లను ఆనందించవచ్చు. ఈ ఆఫర్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లకు వర్తిస్తుంది.

**రూ.3999, రూ.8499 ప్లాన్లు:** అపరిమిత డేటా, వాయిస్ కాలింగ్‌తో 1 Mbps వేగాన్ని అందిస్తుంది. అంతేకాకుండా, వినియోగదారులు ఈ ప్లాన్‌తో అమెజాన్ ప్రైమ్ లైట్, జియో హాట్‌స్టార్‌తో పాటు 8 ఇతర ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌లను పొందుతారు. ఈ ఆఫర్ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లకు వర్తిస్తుంది.

**జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో జియో ఎయిర్‌ఫైబర్ ప్లాన్‌లు**

జియో ఎయిర్ ఫైబర్ రూ.599 ప్లాన్: 1000GB డేటా, 30Mbps వేగం, ఉచిత వాయిస్ కాలింగ్‌తో పాటు 800 టీవీ ఛానెల్‌లు, జియో హాట్ స్టార్ తో సహా మొత్తం 9 ఓటీటీలను అందిస్తుంది.

**జియో రూ.899, రూ.1199 ప్లాన్లు:** 1000GB డేటా, 100Mbps వేగం, ఉచిత వాయిస్ కాలింగ్‌తో పాటు 800 టీవీ ఛానెల్‌లు, జియో హాట్‌స్టార్‌తో సహా మొత్తం 13 ఓటీటీలను అందిస్తుంది.

# అనిసిమోవా అదరహో

## ఖతర్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన అమెరికా స్టార్

## కెరీర్‌లో తొలిసారి డబ్ల్యూటీఏ 1000 టైటిల్ సొంతం

దోహా: ఎనిమిదేళ్ల క్రితం మహిళల టెన్నిస్‌లో భవిష్యత్ తారగా గుర్తింపు తెచ్చుకున్న అమెరికా ప్లేయర్ అమండా అనిసిమోవా ఎట్టకేలకు తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకుంది. గ్రాండ్‌స్లామ్ తర్వాత రెండో అత్యున్నత శ్రేణి అయిన మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) 1000 సిరీస్ టోర్నీలో ఆమె మొదటిసారి విజేతగా అవతరించింది. ఖతర్ ఓపెన్‌లో 23 ఏళ్ల అనిసిమోవా చాంపియన్‌గా నిలిచింది. దోహాలో జరిగిన సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 41వ ర్యాంకర్ అనిసిమోవా 6-4, 6-3తో 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఎలెనా ఒస్టాపెంకో (లాత్వియా)పై గెలిచింది. అనిసిమోవాకు 5,97,000 డాలర్ల (రూ. 5 కోట్ల 17 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2002లో మోనికా సెలెస్ తర్వాత ఖతర్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన రెండో అమెరికా ప్లేయర్‌గా అనిసిమోవా గుర్తింపు పొందింది.



# గుజరాత్ వేట షురూ

## యూపీ వారియర్స్‌పై ఘనవిజయం

## ఆష్లే గార్డ్‌నర్ ఆల్‌రౌండ్ షో



వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ అదరగొట్టింది. ఆదివారం వడోదర వేదికగా యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్.. 6 వికెట్ల తేడాతో యూపీని ఓడించి మూడో సీజన్‌లో టైటిల్ వేటను షురూ చేసింది. యూపీ నిర్దేశించిన 144 పరుగుల ఛేదనను గుజరాత్.. 18 ఓవర్లలోనే పూర్తిచేసింది. ఆ జట్టు సారథి ఆష్లే గార్డ్‌నర్ (32 బంతుల్లో 52, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. హర్లీన్ (34 నాటౌట్), డాటిన్ (33 నాటౌట్) రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన యూపీని కెప్టెన్ దీప్తి శర్మ (39), ఉమా ఛెత్రి (24) ఆదుకున్నారు. గుజరాత్ స్పిన్నర్ ప్రియా మిశ్రా (3/25) ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసింది.

**గార్డ్‌నర్ జోరు**

స్వల్ప ఛేదనే అయినా విజయం కోసం గుజరాత్ చెమటోడ్చక తప్పలేదు. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై యూపీ స్పిన్నర్లు తొలి రెండు ఓవర్లలోనే మూనీ, హేమలతను పెవిలియన్‌కు పంపి జెయింట్స్‌పై ఒత్తిడి తెచ్చారు. అయితే లారా వోల్వార్ట్ (22)తో కలిసిన గార్డ్‌నర్.. గుజరాత్ ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చింది. క్రాంతి 3వ ఓవర్లో రెండు బౌండరీలతో వేట మొదలెట్టిన ఆమె సైమా 5వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టింది. ఎకిల్‌స్టోన్ 9వ ఓవర్లో లారా నిష్క్రమించినా గార్డ్‌నర్ దూకుడును ఆపలేదు. 28 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన ఆమెను మెక్‌గ్రాత్ ఔట్ చేసింది. ఆష్లే నిష్క్రమించినా డాటిన్, హర్లీన్ మరో వికెట్ పడకుండా ఛేదనను పూర్తిచేశారు.

**ప్రియా మాయ**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన యూపీ 22 పరుగులకే రెండు కోల్పోయినా ఉమా, దీప్తి ఆ జట్టును ఆదుకున్నారు. ఈ ద్వయం మూడో వికెట్‌కు 51 పరుగులు జోడించడంతో ఒక దశలో యూపీ 72/2తో పటిష్ఠంగానే కనిపించింది. కానీ ప్రియా మాయతో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ కుదేలైంది. డాటిన్ బౌలింగ్‌లో ఉమ క్యాచ్ అందుకున్న ప్రియా.. ఆ తర్వాత దీప్తి, మెక్‌గ్రాత్, హారీస్‌ను ఔట్ చేసి యూపీని కోలుకోలేని దెబ్బతీసింది. ఆఖర్లో శ్వేత (16), అలానా (19), సైమా (15) మెరుపులతో ఆ జట్టు పోరాడగలిగే స్కోరును సాధించింది. గార్డ్‌నర్ (2/39) బౌలింగ్‌లోనూ రాణించింది.

**సంక్షిప్త స్కోర్లు:**

యూపీ: 20 ఓవర్లలో 143/9 (దీప్తి 39, ఉమ 24, ప్రియా 3/25, డాటిన్ 2/34)బీ గుజరాత్: 18 ఓవర్లలో 144/4 (గార్డ్‌నర్ 52, హర్లీన్ 34 నాటౌట్, ఎకిల్‌స్టోన్ 2/16)

# ఆగయా ఐపీఎల్ షెడ్యూల్

- కేకేఆర్, ఆర్సీబీ మధ్య తొలి పోరు
- కోల్‌కతాలో ఆరంభ, ఆఖరి మ్యాచ్‌లు
- 23న ఎస్ఆర్‌హెచ్ మొదటి మ్యాచ్
- హైదరాబాద్‌లో ప్లేఆఫ్స్



వేసవిలో క్రికెట్ మజాను అందించడానికి ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్ సిద్ధమైంది. ఐపీఎల్ 18వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. దేశంలోని 13 నగరాలలో ఏకంగా 65 రోజుల పాటు సుదీర్ఘంగా జరిగే ఈ క్రికెట్ పండుగకు మార్చి 22న తెరలేవనుంది. అంతర్జాతీయ క్రికెట్ స్టార్లతో కలిసి దేశవాళీ యువ సంచలనాలు మెరుపులు మెరిపించబోయే ఈ క్యాష్ రిచ్ ఈవెంట్‌లో తొలి మ్యాచ్ కేకేఆర్, ఆర్‌సీబీ మధ్య జరుగనుంది. ఈసారి హైదరాబాదీలకు 'డబుల్' బొనాంజా. లీగ్ మ్యాచ్‌లతో పాటు నాకౌట్ మ్యాచ్‌లకూ ఉప్పల్ స్టేడియం ఆతిథ్యమివ్వనుండటం గమనార్హం.

ముంబై: ధనాధన్ క్రికెట్ పండుగ ఐపీఎల్-2025 షెడ్యూల్ వచ్చేసింది. కోట్లాది అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదివారం సాయంత్రం ఐపీఎల్-18వ సీజన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. భారత క్రికెట్ మక్కా ఈడెన్ గార్డెన్ వేదికగా మార్చి 22న మొదలై రెండు నెలల పాటు అభిమానులను ఉర్రూతలూగించే ఈ మెగా టోర్నీ.. అదే మైదానంలో మే 25న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. డిఫెండింగ్ చాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తో 18వ సీజన్‌కు తెరలేవనుంది. గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్.. మార్చి 23న సొంత గ్రౌండ్ (ఉప్పల్)లో రాజస్థాన్ రాయల్స్‌తో ఆడబోయే మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనుంది. కాగా లీగ్ దశలో హైదరాబాద్ వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఒక్కమ్యాచ్ లేకపోవడం ఇక్కడి కోహ్లీ అభిమానులకు కాస్తంత నిరాశే!

**బ్లాక్‌బస్టర్ ఓపెనింగ్**

సీజన్ ఆరంభమే బ్లాక్‌బస్టర్ ఆరంభం దక్కేలా నిర్వాహకులు ప్లాన్ చేశారు. తొలి మ్యాచ్‌లో కేకేఆర్, ఆర్‌సీబీ తలపడనుండగా మార్చి 23న మొదటి డబుల్ హెడర్‌లో భాగంగా ఉప్పల్‌లో మధ్యాహ్నం 3:30 గంటలకు హైదరాబాద్ - రాజస్థాన్ తలపడతాయి. అదే రోజు రాత్రి ఐపీఎల్ అభిమానులు 'ఎల్‌క్లాసికో'గా పిలుచుకునే చెన్నై%శ%ముంబై ఢీకొననున్నాయి. ఇక 24న ఢిల్లీ-లక్నో, గుజరాత్-పంజాబ్ తమ టైటిల్ వేటను ప్రారంభించనున్నాయి. చెన్నై, ముంబై మధ్య ఏప్రిల్ 20న రెండో మ్యాచ్ జరుగుతుంది.

**10 జట్లు.. 2 గ్రూపులు.. 14 మ్యాచ్‌లు**

టోర్నీలో పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ ఉండగా గ్రూప్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఉన్నాయి. ప్రతి గ్రూపులోని జట్టు.. అదే గ్రూపులోని ఇతర జట్లతో తలా రెండు మ్యాచ్‌లు ఆడనుండగా ప్రత్యర్థి గ్రూపులోని ఉన్న ఒక జట్టు (సీడింగ్ ప్రకారం)తో మినహా మిగిలిన నాలుగు జట్లతో తలా ఒక మ్యాచ్ ఆడుతుంది. ఉదాహరణకు ఎస్ఆర్‌హెచ్.. గ్రూప్-1లో కేకేఆర్‌తో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా బెంగళూరు, రాజస్థాన్, చెన్నై, పంజాబ్‌తో ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడనుంది.

**హైదరాబాద్‌లో నాకౌట్ మ్యాచ్‌లు**

65 రోజుల పాటు దేశంలోని 13 వేదికలలో 74 మ్యాచ్‌లు (70 లీగ్, 4 ప్లేఆఫ్స్)గా జరుగబోయే ఈ పొట్టి క్రికెట్ సంరంభంలో భాగంగా ఇరు తెలుగు రాష్ట్రాలకు ఈసారి క్రికెట్ మజా రెండింతలు కానుంది. హైదరాబాద్‌లో ఏడు లీగ్ మ్యాచ్ (ఎస్ఆర్‌హెచ్)లతో పాటు తొలి క్వాలిఫయర్ (మే 20), ఎలిమినేటర్ (మే 21) మ్యాచ్ (మొత్తం 9)లకూ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. గత సీజన్ మాదిరిగానే 2025లోనూ ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో రెండు మ్యాచ్‌లు (ఢిల్లీ క్యాపిటల్స్‌కు రెండో హోంగ్రౌండ్) జరుగనున్నాయి. ధర్మశాలలో 3 (పంజాబ్‌కు), గువహతిలో 2 (రాజస్థాన్‌కు) మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సీజన్‌లో మొత్తం 12 డబుల్ హెడర్స్ ఉన్నాయి.

# భారత హాకీ జట్లకు మిశ్రమ ఫలితాలు



భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో హాకీ లీగ్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ముందుగా భారత మహిళల జట్టు 'షూటౌట్'లో 1%-%2తో ఇంగ్లండ్ జట్టు చేతిలో ఓడిపోగా... అనంతరం భారత పురుషుల జట్టు 2%-%0 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టుపై విజయం సాధించింది. భారత జట్టు తరఫున మన్‌దీప్ సింగ్ (32వ నిమిషంలో), దిల్‌ప్రీత్ సింగ్ (39వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఇంగ్లండ్%-%భారత్ మహిళల జట్ల మధ్య మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 2%-%2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (53వ నిమిషంలో), రుతుజా (57వ నిమిషంలో)... ఇంగ్లండ్ తరఫున పెయిజ్ గిలోట్ (40వ నిమిషంలో), టెసా హొవార్డ్ (56వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. తొలి ఐదు షాట్‌లు ముగిశాక రెండు జట్లు 1%-%1తో సమంగా నిలిచాయి. ఆ తర్వాత ఆరో షాట్‌లో రెండు జట్ల క్రీడాకారిణులు విఫలమయ్యారు. ఏడో షాట్‌లో భారత ప్లేయర్ లాల్‌రెమ్‌సియామి గురి తప్పగా... ఇంగ్లండ్ ప్లేయర్ సోఫీ హామిల్టన్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్‌కు ఓటమి ఖరారైంది.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# సాయిపల్లవికి ముద్దు పెట్టిన అభిమాని..

కథానాయిక సాయిపల్లవి (%ఖుఱ ౯ఖుశ్రీశ్రీఖుజఱ%) ఎంచుకునే కథలు వేటికవే విభిన్నంగా ఉంటాయి. ఏవి పడితే అవి చేసుకుంటూ పోకుండా ప్రాధాన్యమున్న పాత్రల్ని మాత్రమే చేసుకుంటూ వస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల తండేల్ సినిమా చేసింది. ఇందులో మరోసారి తన నటనతో కట్టిపడేసింది. ఇప్పటికే ఈ మూవీ వంద కోట్ల క్లబ్‌లో చేరింది. ఇకపోతే తండేల్ ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ఓ ఈవెంట్‌లో జరిగిన చిన్న సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విడుదలకు ముందు జరిగిన తండేల్ జాతర ఈవెంట్‌లో ఓ మహిళా అభిమాని ఎలాగోలా సాయిపల్లవిని చేరుకుంది. తనతో సెల్ఫీ దిగిన అమ్మాయి హీరోయిన్ షేక్‌హ్యాండ్ ఇచ్చింది. దీంతో తెగ సంతోషపడిపోయిన ఆమె సాయిపల్లవి చేతికి ముద్దు పెట్టింది.

**బుజ్జి తల్లికి బాషా రేంజ్ ఎలివేషన్**

ఈ వీడియో ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరలవుతోంది. బాషా సినిమాలో రజనీకాంత్ మాణిక్ బాషాగా మారిన సమయంలో తన అనుచరులంతా కూడా ఆయన చేతిని ముద్దాడుతుంటారు. ఆ సీన్‌తో సాయిపల్లవి క్లిప్‌ను పోలుస్తూ బుజ్జితల్లికి బాషా రేంజ్ ఎలివేషన్ ఇస్తున్నారు. ఇకపోతే సాయిపల్లవి ప్రస్తుతం రామాయణ సినిమాలో నటిస్తోంది. ఇందులో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్నాడు.



# నారి:చిన్మయి నోట స్త్రీ శక్తిని చాటే పాట

ఓ విద్యార్థిని తన టీచర్‌తో అమ్మాయిలు ఈ సమాజంలో ఎదుర్కొనే కష్టాలు, సమస్యల గురించి చెబుతూ ఉన్న వీడియో సోషల్ మీడియాలో 7 మిలియన్ల వ్యూస్‌ను దక్కించుకుంది. ఈ క్లిప్ నారి చిత్రంలోనిదే అని తెలుసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క గ్లింప్స్, టీజర్ రిలీజ్ చేసి చిత్రయూనిట్‌ను మెచ్చుకున్న సంగతి తెలిసిందే. హైకోర్టు జస్టిస్ శ్రీమతి రాధారాణి గారు, ఐఏఎస్ పూనం మాలకొండయ్య, ఐపీఎస్ జయచంద్ర గార్ల చేతుల మీదుగా ర్యాప్ సింగర్ సీషోర్ పాడిన 'ఈడు మగాడేంట్రా బుజ్జి' పాట 8 మిలియన్ల వ్యూస్‌తో సోషల్ మీడియాలో దూసుకుపోతోంది.షి ఫిల్మ్స్, హైదరాబాద్ స్టూడియోస్ బ్యానర్ల మీద శ్రీమతి శశి వంటిపల్లి నిర్మాతగా సూర్య వంటిపల్లి తెరకెక్కించిన చిత్రం 'నారి'. ఈ చిత్రంలో ఆమని, వికాస్ వశిష్ట, మౌనిక రెడ్డి, కార్తికేయ దేవ్, ప్రగతి, సునయన, ప్రమోదిని, నిత్య శ్రీ, కేదార్ శంకర్, రాజమండ్రి శ్రీదేవీ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు.మహిళా దినోత్సవం సందర్భంగా నారి చిత్రాన్ని మార్చి 7న రిలీజ్ చేయబోతోన్నట్టుగా మేకర్స్ ప్రకటించారు. ఈ క్రమంలోనే శనివారం(ఫిబ్రవరి 15 ) సాయంత్రం నారి చిత్రం నుంచి ఓ పాటను రిలీజ్ చేశారు. ఈ పాటను చిన్మయి శ్రీపాద ఆలపించారు. వినోద్ కుమార్ విన్ను బాణీ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. మహిళా సాధికారత, స్త్రీ శక్తిని చాటేలా ఈ పాటను ప్రసాద్ సానా రచించారు.



# 'ఛావా' సినిమా చూసి కన్నీళ్లతో ప్రేక్షకులు..

**బాలీవుడ్** హీరో విక్కీ కౌశల్ రష్మిక జోడీగా నటించిన చిత్రం 'ఛావా'.. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో ఆయన భార్యగా, మహారాణి యేసుబాయిగా రష్మిక మందన్న నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ మూవీ కేవలం రెండు రోజుల్లోనే రూ. 86 కోట్లు రాబట్టింది.1689 సమయంలో మొఘల్ చక్రవర్తి ఔరం గజేబు మరాఠా సామ్రాజ్యంపై దండెత్తిన సమయంలో తమ రాజ్యాన్ని కాపాడుకోవడానికి వారు చూపిన ధైర్యసాహసాలను కళ్ళకు కట్టినట్లు దర్శకుడు చూపారు. ముఖ్యంగా క్లైమాక్స్ సీన్స్ చూసిన ప్రేక్షకుల కంటతడి పెట్టుకుంటున్నారు. చాలా ఎమోషనల్‌గా తమ అభిప్రాయాన్ని సోషల్‌మీడియా వేదికగా పంచుకుంటున్నారు. మూవీ చూసిన వారిలో ఎక్కువ భాగం కన్నీళ్లతోనే బయటకు వస్తున్నారు. థియేటర్‌లోనే శంభాజీ మహారాజ్‌ను గుర్తు చేసుకుంటూ కేకలు వేస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.సోషల్ మీడియా వేదికగా ఛావా సినిమాపై భారీగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన భార్య యేసుబాయిగా రష్మికల నటన పట్ల పాజిటివ్ టాక్ వస్తుంది. చివరి 40 నిమిషాలు సినిమాను మరో రేంజ్‌కు తీసుకెళ్లారంటూ మెచ్చుకుంటున్నారు. బుక్‌మైషోలో రోజుకు 2 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోతున్నాయి. బాలీవుడ్‌లో ఎక్కడ చూసిన కూడా హౌస్‌ఫుల్ బోర్డులతో థియేటర్స్ కనిపిస్తున్నాయి.

# 'విశ్వంభర' మూవీలో మెగా వారసులు.!



చిరంజీవి హీరోగా టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీ విశ్వంభర. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ప్రస్తుతం చిరంజీవిపై ఇంట్రో సాంగ్ షూట్ చేస్తున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది.ఇదిలావుంటే ఈ మూవీలో మెగా వారసులు నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో నటుడు సాయధరమ్ తేజ్‌తో పాటు నాగబాబు కూతురు నిహారికా కొణిదెలా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే సాయి ధరమ్ తేజ్ షూటింగ్‌లో కూడా పాల్గొన్నాడని వార్తలు వస్తున్నాయి.



# నో వాటర్ బాటిల్.. మహేశ్‌తో సహా అందరికి జక్కన్న కండీషన్!

రాజమౌళితో సినిమా అంటే నటీనటులు ఎంత ఇష్టపడతారో అంతే భయపడతారు కూడా. ఒక్కసారి ఆయనతో సినిమా కమిట్ అయితే చాలు.. షూటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరు ఆయన మాట వినాల్సిందే. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా సరే జక్కన్న పెట్టే కండీషన్స్ ఫాలో అవ్వాల్సిందే. ప్రస్తుతం ఈ దర్శకధీరుడు మహేశ్ బాబుతో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మధ్యే షూటింగ్ కూడా ప్రారంభమైంది. దాదాపు రూ.1000 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. భారీ బడ్జెట్ మూవీ కాబట్టి ఖర్చుల దగ్గర జక్కన్న చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడట. అనవసరపు ఖర్చులు తగ్గించి, ఆ డబ్బంతా సినిమా క్వాలిటీ కోసం ఖర్చు చేయబోతున్నారట. ఈ నేపథ్యంలో జక్కన్న ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సెట్‌లో ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేదించారట. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ని సెట్‌లోకి అనుమతించట్లేదట. మహేశ్‌బాబుతో సహా ప్రతి ఒక్కరు ఈ రూల్‌ని పాటించాల్సిందేనట.

# వేసవిలో ధనుష్ 'ఇడ్లీ కొట్టు '

ధనుష్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న తమిళ చిత్రం 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు). ఈ మూవీలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రాజ్ కిరణ్, అరుణ్ విజయ్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. వండర్‌బార్ ఫిలిమ్స్, డాన్ పిక్చర్స్ బ్యానర్స్‌పై ధనుష్, ఆకాశ్ భాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'ఇడ్లీ కడై' తెలుగు విడుదల హక్కులను శ్రీ వేధాక్షర మూవీస్ అధినేత, నిర్మాత చింతపల్లి రామారావు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ%-% "రాయన్' మూవీ తర్వాత ధనుష్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'ఇడ్లీ కడై'పై మంచి అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ధనుష్‌కి ఇది నటుడిగా యాభై రెండో చిత్రం, అలాగే ఆయన దర్శకత్వం వహిస్తున్న నాలుగో సినిమా. ఈ మూవీకి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం, కిరణ్ కౌశిక్ సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని ఈ ఏడాది వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో నటించిన 'విడుదల 2' చిత్రాన్ని ఇటీవల మా బ్యానర్‌లో తెలుగులో రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది" అని తెలిపారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.